


డిగ్రీ అడ్మిషన్లు ఇంకెప్పుడు?

ఇంటర్ ఫలితాలు వచ్చి నాలుగు నెలులు కావస్తున్నా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కాలేదు. నేటికీ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో విద్యార్థులుఆందోళన చెందుతున్నారు. 10లో▸



మాతృత్వం.. దూరం

సృష్టిలో ప్రతి స్త్రీ తను ఒక బిడ్డకైనా జన్మనిచ్చి అమ్మకావాలని భావిస్తుంది. కానీ ఈ వరం ఇప్పుడు కొందరికి ఆలస్యంగా, మరికొందరికి అసలు కావడం లేదు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 24,116
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 23,655

న్యూస్‌రీల్

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్వీ విజయ మనోహారి



కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్వీ విజయ మనోహరి నియమితులయ్యారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమెను నియమిస్తూ మంగళవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఫసల్ బీమా యోజనకు సర్వర్ సమస్య

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు సర్వర్ సమస్య రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత నెల 30వ తేదీ నుంచి సర్వర్ సమస్య వేధిస్తున్నప్పటికీ పరిష్కారానికి వ్యవసాయ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. పీఎంఎఫ్‌బీవై కింద ప్రీమియం చెల్లింపు గడువు జూలై 31తోనే ముగిసింది. అయితే సర్వర్ సమస్యతో రైతులు సద్వినియోగం చేసుకోలేదనే కారణంతో నాన్ లోనీ ఫార్మర్స్‌కు ఈ నెల 14 వరకు, లోనీ ఫార్మర్స్‌కు ఈ నెల చివరి వరకు ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించింది. అయితే సర్వర్ సమస్య యథావిధిగా కొనసాగుతుండటం రైతులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. గడువు పెంచినప్పటికీ సర్వర్ సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆలూరు, కల్లూరు, ఓర్వకల్, వెల్దుర్తి తదితర మండలాల్లో సర్వర్ సమస్య కారణంగా షోయింగ్ సర్టిఫికెట్ జనరేట్ కావడం లేదు. ప్రీమియం చెల్లించేందుకు కేంద్రం గడువు పెంచినప్పటికీ రైతులు ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది.

రైతుల అవసరాలపై బ్లాంకెట్ సర్వే

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం పశుపోషణ రంగంలో రైతుల అవసరాలపై సర్వే చేపట్టింది. పశు పోషణలో రుణాలు, బీమా అవసరాలపై బ్లాంకెట్ సర్వే కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ కొద్ది రోజులుగా నిర్వహిస్తోంది. సెప్టెంబర్ 15 వరకు ఈ సర్వే కొనసాగనుంది. జిల్లాలో 600 గ్రామాలు ఉండగా... 450 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతోంది. ఆయా గ్రామాల్లో 85,980 హౌస్‌హోల్డ్‌ను సర్వే చేస్తారు. ఏహెచ్‌ఏలు, పారా సిబ్బంది 317 మంది ఈ సర్వేలో నిమగ్నమైనట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు.

వృద్ధుల ఇంటికే రేషన్ సరుకులు

కర్నూలు(సెంట్రల్) : 65 ఏళ్లు దాటిన వృద్ధులకు కచ్చితంగా రేషన్ సరుకులను ఇళ్ల దగ్గరకే తీసుకెళ్లి ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం.రాజారఘువీర్, మునిసిపల్ అధికారులు, కర్నూలు తహసీల్దార్ కార్యాలయ ఉప తసీల్దార్లతో సమీక్షించారు. ప్రతి నెల 25 నుంచి నెలాఖరులోపు వృద్ధులకు కచ్చితంగా ఇళ్లకే వెళ్లి డీలర్లు సరుకులను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పేకాట

పాణ్యం: తమ్మరాజుపల్లె గ్రామంలో టీడీపీ నాయకులే స్వయంగా పేకాట ఆడిస్తున్నారు. మంగళవారం సాయంత్రం పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు.. గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నం చేయగా పోలీసుల చేతి నుంచి పలువురు తప్పించుకొని పరారయ్యారు. పేకాట స్థావరంలో టీడీపీ నాయకులు ఎర్రమల నాయుడు, మీనిగ శ్రీరంగడు, నాగరాజు పట్టుబడ్డారు. గ్రామ టీడీపీ నాయకులు బత్తుల శ్రీనివాసులు అలియాస్ దుబాయ్ శ్రీనుతో పాటు మరో నలుగురు పరారయ్యారు. అయితే టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఈ పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. పరారైన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పట్టుబడిన నిందితుల నుంచి రూ.14,930, రెండు బైక్‌లు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు.

మల్లన్నకు ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీస్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించి, మహా గణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆసీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అలాగే ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు నిర్వహించారు.

జల విలయం

- ఆదోనిలో కుండపోత వర్షం
- తెల్లవారు జామున రెండు గంటల ఏకధాటిగా వాన
- 8.25 సెం.మీ వర్షపాతం నమోదు
- లోతట్టు కాలనీలు జలమయం
- ప్రధాన రహదారులు, వీధుల్లో మోకాళ్లలోతు నీరు
- ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

ఆదోని పాతబస్టాండ్ వద్ద మోకాళ్లలోతులో పారుతున్న వర్షం నీరు



ఆదోని సెంట్రల్/అర్బన్/రూరల్: ఆకాశం ఉరిమింది. వరుణుడు గర్జించాడు. ఆదోని పట్టణం జలమయమైంది. కుండపోత వర్షంతో దారులన్నీ ఏరులై ప్రవహించాయి. లోతట్టు కాలనీలు నీట మునిగి అతలాకుతలమయ్యాయి. పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున 5.30 నుంచి 7.30 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారి మొదలుకొని పలు కాలనీల్లో వంకలను తలపించాయి. పట్టణంలో 8.25 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మోకాళ్లలోతు వర్షపు నీరు పారుతుండడంతో జనాలు ఇళ్ల నుంచి బయటికి రావడానికి ఇబ్బందులకు గురయ్యారు. హన్వాజీ పేటలో రైతు బజార్ లోతట్టు ప్రాంతంలో ఉండడంతో నీరంతా అందులోకి చేరాయి. దీంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఫ్లైఓవర్ కింది భాగంలోని రైల్వే ట్రాక్ నుంచి స్టేషన్‌కు వెళ్లే రోడ్డు, టెన్నిస్ కోర్టు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అగ్నిమాపక కార్యాలయం, మర్చెంట్ క్లబ్, తహసీల్దార్, సబ్ కలెక్టర్, కోర్టు ప్రాంగణాల చుట్టూ నీరు నిల్వ చేరాయి. అయా పనుల మీద కార్యాలయాలకు వెళ్లే ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, గీతా మార్కెట్‌లో నీరు చేరి వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా హవన్నపేట, కొడల్ పేట, దండుగేరి, వడ్డేవీధి, బుడ్డేకల్లు ప్రాంతాల్లో వర్షాపు నీరు ఇళ్లలోకి చేరాయి. శివారు కాలనీల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి. రాయనగర్, శివశంకర్ నగర్ వంటి కాలనీలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరాయి. దీంతో ఇళ్లలోని వస్తువులతో పాటు సరకులు తడిశాయి. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని అయా కాలనీ వాసులు వాపోతున్నారు. పుర పాలక చైర్‌పర్సన్ లోకేశ్వరి నీరు నిలిచిన కాలనీలను పరిశీలించారు.

రణమండల కొండపై జలపాతంలా నీటి ప్రవాహం



నీట మునిగిన ప్రధాన రహదారులు

వర్షానికి పట్టణమంతా జలమయంగా మారింది. గత 2009లో కురిసిన భారీ వర్షం మళ్లీ ఇప్పుడు కురిసింది. భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు వంకలను తలపించాయి. దీంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు జలమయమైన పట్టణంలోని రాయనగర్ కాలనీలో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకుని నీటి నిల్వలు తొలగించేలా మున్సిపల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

రాయనగర్‌లో మాజీ ఎమ్మెల్యే పర్యటన



పరిస్థితిని సమీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోనిటౌన్: పట్టణంలో సోమవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు ఆదోని ప్రాంతం అతలాకుతలమయ్యింది. వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. పట్టణంలోని రాయనగర్ ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను కోరారు. మున్సిపల్ కార్యాలయం ముందు వరదనీరు మోకాళ్ల లోతు పైగానే నిలిచి పోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శుభ్రం చేయించారు. ఇందిరానగర్, ఎరుకల కాలనీ, శ్రీనివాసభవన్, మండిగిరి, బోయగేరి, వడ్డేగేరి, ఆర్టీసీ కాలనీ, శివశంకర్‌నగర్, ఎన్‌జీవోస్ కాలనీ ప్రాంతాల్లో వంకలు, వాగులు పొంగి పొర్లాయి.

రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్):రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని 17 మండలాల్లో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురిసింది. ఆదోనిలో అతి భారీ వర్షం కురిసింది. ఏకంగా 82.5 మి.మీ వర్షపాతం నమోదు కావ డం విశేషం. కుండపోత వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆదోని మినహా మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు మాత్రమే కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. ఈ నెల సగటున 6న 25 మి.మీ, 7న 15.4, 8న 20, 9న 25, 10న 11.5 మి.మీ ప్రకారం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఉష్ణోగ్రతలు 34.6 డిగ్రీల నుంచి 35 డిగ్రీల వరకు నమోదు అయ్యే అవకాశం ఉందని, గాలుల తీవ్రత 7–10 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

మండలం	వర్షపాతం(మి.మీ..)
హొలహర్వి	34.6
ఆస్పరి	24.4
చిప్పగిరి	22.8
దేవనకొండ	22.2
కృష్ణగిరి	14.4
కర్నూలు అర్బన్	10.6
కౌతాళం	10
కర్నూల్ రూరల్	9.4



రైతు బజారును ముంచెత్తిన వర్షపు నీరు



బోయగేరిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి



ఇంట్లోకి చేరిన నీటిని తోడేస్తున్న కుటుంబం



తడిచిన ఇంట్లోని సామగ్రి



మేతర్ మసీదు ఏరియాలో జలమయమైన రహదారి

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాల్సిందే

- ప్రజల సొమ్మును దోచుకునేందుకు కుట్ర
- సర్దుబాటు చార్జీల పేరుతో పేదలపై భారం తగదు
- ప్రజాసంఘాల ఐక్య వేదిక నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రజలకు భారంగా మారే విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ కొన్ని నెలలుగా ప్రజా సంఘాలు పోరాటం చేస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం స్పందికపోవడం దారుణమన్నారు. స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక మంగళవారం కొత్తబస్టాండు సమీపంలోని విద్యుత్‌భవన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టింది. వందలాది వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు విద్యుత్ భవన్ ఎదుట బైఠాయించి స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కల్లూరు దర్వాజ, జొహరాపురం, బి.క్యాంపు, కేవీఆర్ మహిళ డిగ్రీ కళాశాల దగ్గర ఉన్న పవర్ హౌస్, కల్లూరు ఎస్టేటు తదితర ప్రాంతాల్లో ఉన్న సబ్ స్టేషన్ ఎదుట ఆందోళనలు చేపట్టారు. గురుశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు రాముడు, రైతు సంఘం సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, ఏడీఐఎస్‌వో రాష్ట్ర నాయకులు హరీష్, నాగన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అలివేలు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి నగేష్, సీఐటీయు ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను పగులకొట్టమని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ నేడు వాటినే బిగిస్తుండటం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని రద్దు చేయకపోతే కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతికి వినతిపత్రం సమరించారు.

– జొహరాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట జరిగిన ధర్నాలో పాల్గొన్న కార్మిక ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా నాయకులు గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ... స్మార్ట్‌మీటర్లు బిగించడం అంటే ప్రజల సొమ్మును విద్యుత్ బిల్లుల పేరుతో కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టడమేనని, స్మార్ట్ మీటర్ల స్థానంలో పాత మీటర్లను బిగించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే ఒక్కపైసా చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు నేడు అడ్డగోలుగా టూఅప్ చార్జీలు, సర్దుబాటు పేరుతో ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. ధర్నా కార్యక్రమాల్లో ప్రజాసంఘాల నేతలు మహమ్మద్, శేషాద్రి, అబ్దుల్లా, హుసేనయ్య, శ్రీరాములు, మధు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక సభ్యులు

లోకల్ యాప్ ద్వారా ఉద్యోగాల పేరుతో వల



ఎస్పీ విక్రాంత్ పాటిల్ (ఫైల్)

కర్నూలు: లోకల్ యాప్ ద్వారా నకిలీ నోటిఫికేషన్లు పంపి నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, యువత అప్రమతంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కర్నూలు పట్టణానికి చెందిన ఓ యువకుడు ఉద్యోగ వేటలో లోకల్ యాప్‌లో ప్రైవేటు బ్యాంకు పేరుతో ఉన్న ప్రకటన చూసి సంబంధిత ఫోన్ నంబర్‌ను సంప్రదించగా ఫోన్‌లోనే ఇంటర్వ్యూ పూర్తి చేసి ఎంపికయ్యావంటూ ప్రాసెసింగ్ ఫీజు, బ్యాంకు గ్రౌండ్ వెరిఫికేషన్, యూనిఫాం, ఐడీ కార్డు పేరుతో రూ.39 వేలు డిమాండ్ చేశారని, ఆ మొత్తాన్ని చెల్లించిన తర్వాత మోసగాళ్లు టచ్‌లో లేకుండా పోయారన్నారు.

అలాగే ఆదోని ప్రాంతానికి చెందిన మరో యువకుడు అసిస్టెంట్ మేనేజర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోగా జాబ్ బాండింగ్ చార్జి పేరిట రూ.76 వేలు వసూలు చేసి తర్వాత నకిలీ ఆఫర్ లెటర్ పంపించి మోసం చేశారని వివరించారు. ఇలా లోకల్ యాప్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలంటూ నకిలీ ప్రకటనలు ప్రచురించి నిరుద్యోగుల వద్ద నుంచి ధ్రువపత్రాలు, ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కొంతమంది తాము ప్రభుత్వ అధికారులమని చెప్పుకుని నమ్మించి నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని వెల్లడించారు.

మోసం చేసే విధానం...

ఆకర్షణీయమైన జాబ్ నోటిఫికేషన్లు లోకల్ యాప్ ద్వారా పంపిస్తారు. తక్కువ అర్హతతో అధిక వేతనం అంటూ ఆకర్షిస్తారు. ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ ఫీజు, ప్రాసెసింగ్ చార్జీలు అడగటం, నకిలీ ఇంటర్వ్యూ లు, నకిలీ ఆఫర్ లెటర్లు పంపి మోసం చేస్తారు.

పోలీసు సూచనలు

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నియామక ప్రక్రియ అధికారిక వెబ్‌సైట్లు, నోటిఫికేషన్ల ద్వారా ప్రతిభ ఆధారంగానే జరుగుతుంది. ఉద్యోగం కోసం ఎవరూ డబ్బులు అడగరు. అడిగితే అది మోసమనే విషయం గుర్తించాలి. లోకల్ యాప్ వంటి ఫ్రీ క్లాసిఫైడ్ యాప్‌లలో వచ్చిన ఉద్యోగ ప్రకటనలను పూర్తిగా క్రాస్ చెక్ చేసుకోవాలి. అపరిచిత నంబర్ల నుంచి వచ్చిన కాల్స్, వాట్సాప్ సందేశాల్లో లింకులపై క్లిక్ చేయరాదు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు, www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

నిరాశాజనకంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల ధరలు నిరాశాజనకంగా ఉన్నాయి. అంతంతమాత్రం ధరలు లభిస్తుండటంతో ఉల్లి, వేరుశనగ, వాము రైతుల ఆందోళన అంతాఇంతా కాదు. మార్కెట్‌కు ఉల్లి తాకిడి మొదలు కాలేదు. మంగళవారం ముగ్గురు రైతులు మాత్రమే 162 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు తెచ్చారు. కనిష్ట ధర రూ.1069, కనిష్ట ధర రూ.1389 లభించింది.

- వేరుశనగ 1,162 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.3వేలు, గరిష్ట ధర రూ.7,169 లభించగా.. సగటు ధర రూ.4,870 మాత్రమే నమోదైంది.
- వాము రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. 17 మంది రైతులు మార్కెట్‌కు వాము తెచ్చారు. కనిష్ట ధర రూ.2,011, గరిష్ట ధర రూ.13,060 పలికింది. సగటు ధర రూ.12,699 నమోదైంది.
- కందుల ధరలు కూడా తగ్గిపోయాయి. కనిష్ట ధర రూ.5,397, గరిష్ట ధర రూ.6,397 లభించింది.

నేడు వైఎస్ జగన్ డోన్‌కు రాక

- మాజీ మంత్రి బుగ్గన తనయుని వివాహ రిసెప్షన్‌కు హాజరు

డోన్: పట్టణంలో బుధవారం జరిగే రాష్ట్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడు అర్జున్ అమర్నాథ్‌రెడ్డి, మాజీ రాష్ట్రపతి దివంగత నీలం సంజీవరెడ్డి ముని మనవరాలు అనన్యరెడ్డి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. తాడేపల్లిలోని హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 9.30 గంటలకు బయలుదేరి డోన్ పట్టణ శివారులోని ఎం కన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 11.40 గంటలకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కంబాలపాడు సర్కిల్, ఉడుములపాడు మీదుగా 44వ జాతీయ రహదారిపై స్థానిక దత్తాత్రేయ స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో నిర్మించిన వివాహ రిసెప్షన్ వేదికకు చేరుకుంటారు. వధూవరులను ఆశీర్వదించిన అనంతరం తిరిగి కారులో ఎం. కన్వెన్షన్ హాల్ వద్దకు చేరుకుని అనంతరం హెలికాప్టర్‌లో బెంగళూరుకు 12.20కి ప్రయాణమవుతారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

ఏర్పాట్ల పరిశీలన..

ఎం కన్వెన్షన్ హాల్ వద్ద నిర్మించిన హెలిపాడ్‌తో పాటు దత్తాత్రేయ స్వామి గుడి ఆవరణలో నిర్మించిన వివాహ రిసెప్షన్ వేదిక, భోజనశాల షెడ్లను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు ఉన్నారు.

‘ఉల్లి’కిపాటు!

కర్నూలు జిల్లాలో ఉల్లి 9,845 హెక్టార్లలో సాగయింది. మార్కెట్‌కు ఇప్పుడిప్పుడే దిగుబడులు వస్తున్నాయి. మహారాష్ట్రలోనూ పంట ఎక్కువగ సాగవడం, జిల్లాలోనూ దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో ఇప్పటి నుంచే ధర నేల చూపులు చూస్తోంది. మంగళవారం కర్నూలు మార్కెట్‌కు ముగ్గురు రైతులు 162 క్వింటాళ్ల ఉల్లి తీసుకురాగా గరిష్ట ధర రూ.1,389.. కనిష్ట ధర రూ.1,069 నమోదైంది. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే మార్కెట్‌కు దిగుబడుల రాక పెరిగితే ధర ఏస్థాయిలో పడిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం



పెట్టుబడి కూడా దక్కలేదు

ఏడు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశాను. రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం మార్కెట్‌లో విక్రయిస్తే రూ.4లక్షలు పలికింది. లక్ష రూపాయలు కూలీలకే సరిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా దక్కకపోతే రైతులు ఎట్లా బతికేది. వ్యవసాయం చేయాలంటే ప్రాణాల మీదకు వస్తోంది. – గౌల హనుమంతు, వీరంపల్లి, గోనెగండ్ల మండలం



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉల్లి బస్తాలు



ఉల్లి దిగుబడిలో చెత్త తొలగింపు..

క్లుప్తంగా

శ్రీమఠంలో సినీనటుడు సాయికుమార్



సాయికుమార్‌కు స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు

మంత్రాలయం: మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంగళవారం సినీనటుడు సాయికుమార్ విచ్చేశారు. ఆయన మఠం కారిడార్‌కు చేరుకోగా ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, సహాయ పీఆర్వో వ్యాసరాజాచార్‌లు సాంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ఆయన ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని అర్చన సహిత హారతులు పట్టా రు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు శేష వస్త్రం కప్పి, స్వామి వారి అక్షితలు అందజేసి ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను బహూకరించారు.

చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహిద్దాం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కర్నూలు(అర్బన్): ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక బిర్లా కాంపౌండ్‌లో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్, చేనేత కుల సంఘాల సమాఖ్య కర్నూలు యూనిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ చేనేత దినోత్సవం సందర్భంగా 7న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి, అనంతరం 11.30 గంటలకు చేనేత జౌళి శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో చేనేత సమస్యలపై చర్చించి మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రాలను అందిస్తామన్నారు. చేనేత సామాజిక వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నాయకులు చింత శ్రీనివాసులు, దాశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాతృత్వం..దూరం!

- తగ్గిన సంతానోత్పత్తి రేటు
- కర్నూలు జిల్లాలో 1.8, నంద్యాల జిల్లాలో 1.36 రేటు
- జీవనశైలి మారడంతో తగ్గుదల
- యువతుల్లో స్థూలకాయం, పీసీఓడీ
- పురుషుల్లో తగ్గుతున్న శుక్రకణాల సంఖ్య
- 20 శాతం మందికి సంతానలేమి సమస్య
- పెరిగిన సంతాన సాఫల్య కేంద్రాలు



ఇలా చేయాలి
- సమతుల ఆహారం తీసుకోవాలి. రోజూ తగినంత వ్యాయామం చేయాలి. బయటి ఆహారానికి ముఖ్యంగా జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి.
- స్థూలకాయం తగ్గించుకోవాలి. ఇందుకోసం జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి.
- ధూమపానం, మద్యపానం మానేయాలి.
- మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి. ఇందుకోసం యోగా, ధ్యానం చేయాలి.
- వివాహమై ఏడాది దాటినా గర్భం దాల్చకపోతే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి.

కర్నూలు(హాస్పిటల్): సృష్టిలో ప్రతి స్త్రీ తను ఒక బిడ్డకైనా జన్మనిచ్చి అమ్మకావాలని భావిస్తుంది. ఈ మేరకు వివాహమైన నాటి నుంచి పరితపిస్తుంది. పుట్టిన బిడ్డ ఆమె పెంపకంలో పెరుగుతూ ఎదుగుతూ ఉంటే ఆ తల్లి పడే ఆనందానికి హద్దులు ఉండవు. కానీ ఈ వరం ఇప్పుడు అందరి తల్లులకు కలగడం లేదు. కొందరికి ఆలస్యంగా పిల్లలవుతుంటే మరికొందరికి అసలు కావడం లేదు. దంపతులిద్దరిలో లేదా ఒకరిలో లోపం ఉండటం వల్లే ఇలా జరుగుతోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులే దీనికి ప్రధాన కారణమని వైద్యులు భావిస్తున్నారు. ఈ క్రమంలో సంతాన సాఫల్య కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సంతానలేమి సమస్యతో బాధపడే వారి సంఖ్య అధికమైంది. ఒకప్పుడు వందలో ఒకరిద్దరు మాత్రమే సంతానలేమితో బాధపడేవారు. ఇప్పుడు ఆ సంఖ్య పట్టణాల్లో 20 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం వరకు ఉంటోంది. 2023–24 సంవత్సరంలో రాష్ట్రంలో సగటు సంతానోత్పత్తి రేటు 1.21 ఉండగా ఇందులో కర్నూలు జిల్లాలో 1.80, నంద్యాల జిల్లా 1.36గా నమోదైంది. కాగా జిల్లాలోని ఆదోని, పత్తికొండ వంటి ప్రాంతాల్లో సంతానోత్పత్తి 3, 3.5 రేటు ఉండగా కర్నూలు, నంద్యాల వంటి పట్టణ ప్రాంతాల్లో మాత్రం 1.5 కంటే తక్కువగా సంతానోత్పత్తి రేటు పడిపోవడం ఆందోళనకరం.

పెరిగిన సంతాన సాఫల్య కేంద్రాలు

పిల్లలు కలగని దంపతులు ఒకప్పుడు సమీప గైనకాలజిస్టులను కలిసి చికిత్స తీసుకునేవారు. అప్పటికీ పిల్లలు కలగకపోతే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి సంతాన సాఫల్య కేంద్రాల్లోని వైద్యులను సంప్రదించేవారు. వీరి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సిటీల్లో ని సంతాన సాఫల్య కేంద్రాలు పట్టణాల్లోనూ ఏర్పాటవుతున్నాయి. ఈ కారణంగా కర్నూలు, నంద్యాల, ఆదోని వంటి ప్రాంతాల్లోనూ సంతానసాఫల్య కేంద్రాలు వెలిశాయి. కర్నూలు జిల్లాలోనే వైద్య ఆరోగ్యశాఖ వద్ద రిజిస్టర్ అయిన సంతాన సాఫల్య కేంద్రాలు 16 ఉన్నాయి. ఆయా కేంద్రాలకు ప్రస్తుతం ప్రతిరోజూ 50 నుంచి 60 మంది దాకా దంపతులు చికిత్స కోసం వెళ్తున్నారు. కాగా కొన్ని కేంద్రాలు వీరి ఇబ్బందులను ఆసరాగా తీసుకుని అధిక మొత్తంలో డబ్బును డిమాండ్ చేస్తున్నారు. వెళ్లిన ప్రతిసారి రూ.4వేల నుంచి రూ.5వేలు ఖర్చు అయ్యేలా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కేంద్రాలు సంతానం కలగకపోవడానికి గల కారణాన్ని బట్టి గంపగుత్తగా రూ.1లక్ష నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేస్తున్నాయి.

సంతానలేమికి కారణాలు

ఇటీవల కాలంలో చాలా మంది యువతీయువకులు జీవితంలో స్థిరపడ్డాక వివాహం చేసుకుంటున్నారు. దీనికితోడు చదువుకున్న అమ్మాయిలు అధి కం కావడం, వారికి సరిపడా అబ్బాయిలు లభించకపోవడం, అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాల వల్ల ఆలస్యంగా వివాహం చేసుకోవడం, మారిన జీవనశైలి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం, స్త్రీలలో పీసీఓఎస్ (అండాశయంలో తిత్తులు), ఎండోమెట్రియాసిస్ సమస్యలు, రాత్రివేళల్లో ఆలస్యంగా నిద్రపోవడం,జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, మొబైల్‌ఫోన్ స్క్రీన్ ఎక్కువగా చూడటం వల్ల, అన్యోన్య దాంపత్యం లేకపోవడం వల్ల సంతానలేమికి కారణాలు. అయితే గ్రామాల్లో ఇప్పటికీ త్వరగా వివాహాలు కావడం, చిన్న వయస్సులోనే (టీనేజీలో) పిల్లలు అవుతున్నారు. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి రేటు ఎక్కువగా కనిపిస్తోంది. పట్టణాల్లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

జీవనశైలిలో మార్పులే కారణం



జీవనశైలిలో వచ్చిన మార్పులే సంతానోత్పత్తి రేటు తగ్గడానికి కారణం. ఇది పురుషుల్లో 30 శాతం, మహిళల్లో 30 శాతం ఉంది. పురుషుల్లో వీరకణాల సంఖ్య తక్కువగా ఉండటం, మహిళల్లో ఇన్‌ఫెక్షన్లు, పీసీఓఎస్, స్థూలకాయం, మానసిక ఒత్తిడి కారణాలు. పట్టణాల్లో ఆలస్యంగా వివాహం చేసుకోవడం, ఆలస్యంగా పిల్లలను కనాలనే ప్రణాళిక వేసుకోవడం కూడా సంతానోత్పత్తి రేటు తగ్గడానికి మరో కారణం.

–డాక్టర్ ఎస్.సావిత్రి, హెచ్ఓడీ, గైనకాలజి విభాగం, జీజీహెచ్, కర్నూలు

తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి



సంతాన సాఫల్య కేంద్రాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా వైద్య ఆరోగ్యశాఖలో రిజిస్టర్ చేసుకోవాలి. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు మాత్రమే వాటిని నిర్వహించాలి. రిజిస్ట్రేషన్ చేయకుండా ఏఆర్‌టీ కేంద్రాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాము. జిల్లాలో గతంలో కంటే ఇప్పుడు సంతాన సాఫల్య కేంద్రాలు పెరిగాయి. సంతానోత్పత్తి రేటు తగ్గడమూ దీనికి ఒక కారణం కావచ్చు.

–డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్ఓ, కర్నూలు

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి



సంతోష్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని చెన్నాపురం గ్రామం సమీపంలోని స్టోన్ క్రషర్ మిషన్ ఫ్యాక్టరీ దగ్గర మంగళవారం ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై సంతోష్ (22) అనే యువకుడు మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ యువకుడు కొన్ని రోజు క్రితం తమ ప్రాంతానికి చెందిన మేస్త్రీ ద్వారా చెన్నాపురం స్టోన్ క్రషింగ్ మిషన్ ఫ్యాక్టరీలో పనిలో చేరాడు. రోజు మాదిరిగానే ఉదయం ఫ్యాక్టరీ దగ్గర వెల్డింగ్ వర్క్ చేస్తున్నారు. అయితే, ఆ సమయంలో వర్షం రావడంతో షార్ట్ సర్క్యూట్‌కు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు సంతోష్‌ను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీస్‌స్టేషన్ ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును, మృతదేహాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులకు ప్రమాదం విషయం తెలియజేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గనిమల్లేశ్వరి

జూపాడుబంగ్లా: కుటుంబ కలహాలతో మండలంలోని తర్తూరు గ్రామంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. సి.బెళగల్‌కు చెందిన గనిమల్లేశ్వరి (23)కి తర్తూరు గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తితో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కొడుకు, కుమార్తె సంతానం. భర్త మతిస్థిమితం లేకపోవటం, మామ వెంకటేశ్వర్లు దివ్యాంగుడు కావడంతో కుటుంబపోషణ భారమంతా గనిమల్లేశ్వరిపై పడింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె మంగళవారం పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం నందికొట్కూరుకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు గ్రామానికి చేరుకొని బోరున విలపించారు. మల్లేశ్వరి మృతికి భర్త, మామే కారణమని వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధిక వర్షాలు ఉన్నా.. రైతులకు సుఖం లేదు!

- భవిష్యవాణి వినిపించిన వసిగేరప్పతాత భక్తుడు



పూజలందుకున్న వసిగేరప్పతాత



భవిష్య వాణి వినిపిస్తున్న వసిగేరప్పతాత భక్తుడు

హాలహర్వి: నిట్రవట్టి గ్రామంలో మంగళవారం శ్రావణ శుద్ధ దశమి వేడుకలు ఘనంగా జరిగాయి. వసిగేరప్ప తాత భక్తుడు కె.ఏజీ భవిష్యవాణి వినిపించారు. ముంగారి వర్షాలు విశేషంగా గాలి నుంచి మేఘాల ద్వారా వస్తాయని, అయినా రైతులకు సుఖం ఉండదన్నారు. హింగారి వర్షాలు ఏడు కార్తీలు ఉరుములు, మెరుపుల ద్వారా వస్తాయన్నారు. రెండు తుపాన్‌లు ఉంటాయన్నారు. తెల్ల గుర్రం, ఎర్ర గుర్రం వెనుకా ముందు పరుగులు పెడతాయని చెప్పారు. ఆరు మూడు అవుతుంది, మూడు ఆరు అవుతుందని వివరణ ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో భవిష్యవాణిని వినేందుకు తరలించ్చారు.

వామ్మో.. నల్లనాగు



నల్లనాగును పట్టుకున్న స్నేక్ క్యాచర్ మోహన్

మహానంది: బుక్కాపురంలోని హుసేన్ బాషా ఇంట్లో మంగళవారం నల్లనాగు కనిపించి కలకలం సృష్టించింది.బాత్‌రూమ్‌లో సుమారు పది అడుగులకు పైగా ఉన్న నల్లనాగు కనిపించడంతో కుటుంబ సభ్యులు పరుగులు తీశారు. వారు వెంటనే అయ్యన్ననగర్ గ్రా మానికి చెందిన స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారం అందించగా ఆయన గ్రామానికి చేరుకుని పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశాడు.

అట్టహాసంగా బిషప్ పట్టాభిషేకం



బిషప్‌గా నియామక పత్రం అందజేస్తున్న మోడరేటర్ రూబెన్‌మార్క్



నంద్యాల పట్టణంలో బిషప్ దంపతుల ఊరేగింపు దృశ్యం

- అవినీతికి తావు లేకుండా నంద్యాల డయాసిస్ అభివృద్ధికి కృషి చేయాలి
- నూతన బిషప్ సంతోష్ ప్రసన్నరావుకు మోడరేటర్ రూబెన్‌మార్క్ పిలుపు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ బిషప్‌గా కామనూరి సంతోష్ ప్రసన్నరావు పట్టాభిషేక కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. హోలీక్రాస్ కెథడ్రల్ సెంటినరీ చర్చి ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి నంద్యాల డయాసిస్ పరిధిలో ఉన్న పాస్టరేట్ డీనరీ చైర్మన్లు, పాస్టర్లు, కౌన్సిల్ మెంబర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా(చెన్నై) మోడరేటర్ రూబెన్ మార్క్ నూతన బిషప్ సంతోష్ ప్రసన్నరావుతో ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. సంతోషరావు క్రమంగా బిషప్ స్థాయికి ఎదగడం అభినందనీయమని చెప్పారు. అవినీతికి తావు లేకుండా నంద్యాల డయాసిస్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రమాణ స్వీకారం అనంతరం బిషప్ ప్రసన్నరావును రైల్వే స్టేషన్ సమీపంలోని ఎంఎస్ నగర్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయ ఆవరణలో బిషప్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బిషప్‌లు ఐజక్ వరప్రసాద్, జార్జికొర్నెలి, పద్మారావు, తిమోతి, రవీందర్, హేమచంద్రకుమార్, జయసింగ్ ప్రిన్సిస్ ప్రభాకరన్‌లతో పాటు డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్, డయాసిస్ సెక్రటరీ స్టాండ్లీ విలియం, సెంటినరీ చర్చి సెక్రటరీ ప్రభుదాసు, నందం ఐజక్‌తో పాటు అన్ని పాస్టరేట్ల డీనరీ చైర్మన్లు, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా దక్షిణ ఇండియా సంఘం చెన్నై కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గంలో నడుస్తా

క్రీస్తు బోధనలు అనుసరిస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తానని నంద్యాల డయాసిస్ అధ్యక్ష ఖండం పీఠాధిపతి(బిషప్) సంతోష్ ప్రసన్నరావు అన్నారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. డయాసిస్ పరిధిలో ఉన్న ఆస్తులను కాపాడుతూ, నంద్యాలలో విద్య, వైద్య సేవలకు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

మెట్లపై నుంచి జారి లారీ డ్రైవర్ మృతి

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట కాలనీకి చెందిన ఓ లారీ డ్రైవర్ మెట్లపై నుంచి జారీ పడి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్ర శేఖర్ వివరాల మేరకు.. సానె దుశ్యంత్ కుమార్ (33) సోమవారం ఇంటి పైనుంచి కిందికి వచ్చే క్రమంలో మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్ర శేఖర్ మంగళవారం వెల్లడించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

కర్నూలు (రూరల్): కారు అతివేగంతో డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు.. హైదరాబాదుకు చెందిన సోదరులు శివ, మంజునాథ్, శివ సతీమణి, కూతురుతో కలిసి బెంగళూరులో గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై తిరుగు పయనమయ్యారు. సోమవారం అర్ధరాత్రి పంచలింగాల సమీపాన శివ కారును వేగంగా నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో పక్కన కూర్చున్న సోదరుడు మంజునాథ్ (42) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో శివ, ఆయన భార్య, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తాలూకా అర్బన్ సీఐ శ్రీధర్ తెలిపారు.



ఆధునిక వ్యవసాయం

ఆధునిక వ్యవసాయంలో యాంత్రీకరణ కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కూలీల కొరతను అధిగమించడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయి. సంప్రదాయ పద్ధతిలో రోజుకు మూడునాలుగైదు ఎకరాలకు మందు పిచికారీ చేస్తే పెరిగిన సాంకేతికతతో సుమారు 30 నుంచి 40 ఎకరాల వరకు స్ప్రే చేస్తున్నారు. ఈ పద్ధతిలోనే మంగళవారం పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామ సమీపంలో ఓ రైతు ట్రాక్టర్‌కు స్ప్రే యంత్రాన్ని కట్టి మొక్క జొన్న పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

బెల్లందొడ్డిలో చిరుత కలకలం





బెల్లందొడ్డి గ్రామంలో పులి జాడలు పరిశీలిస్తున్న అటవీ అధికారులు, గంజహళ్లి సమీపంలో కనిపించిన చిరుత

దేవనకొండ: మండలంలోని బెల్లందొడ్డి గ్రామ పరిసరాల్లో మంగళవారం ఉదయం చిరుత కనిపించడంతో ఒక్కసారిగా వ్యవసాయ కూలీలు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని పొలాల్లో పులి అడుగులను పరిశీలించి, ప్రజలను అప్రమత్తం చేశారు. అలాగే పులిజాడ కోసం గాలింపు ప్రారంభించారు. గత రెండు, మూడు రోజుల నుంచి గోనెగండ్ల మండలం గంజహళ్లి సమీపంలో సంచరిస్తున్న చిరుతే ఇక్కడికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్లు ఇంకెప్పుడు?

- విద్యార్థుల జీవితాలతో కూటమి సర్కారు చెలగాటం
- ఇంటర్ ఫలితాలు విడుదలై నాలుగు నెలలు కావస్తున్నా వెలువడని నోటిఫికేషన్
- ఆందోళనలో విద్యార్థులు



ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముఖ ద్వారం

కర్నూలు కల్చరల్: ఇంటర్ ఫలితాలు వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కాలేదు. నేటికీ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇంకెంతకాలం నిరీక్షించాలని కూటమి సర్కారును ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 82 డిగ్రీ కళాశాలలున్నాయి. ఇంటర్ పూర్తయిన విద్యార్థుల్లో సగం మంది ఇంజినీరింగ్ వైపు వెళితే మిగతా వారు డిగ్రీలో ప్రవేశానికి ఆసక్తి చూపుతారు. సివిల్స్, సర్వీస్ కమీషన్, పోలీస్ శాఖ, అగ్ని మాపక, అటవీ శాఖ, బ్యాంకింగ్, రైల్వే ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉండటంతో డిగ్రీ కోర్సులపై దృష్టి సారిస్తారు. అయితే. గతంలో ఎప్పుడూ లేని విధంగా కూటమి సర్కారు ప్రవేశాల ప్రక్రియలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఈనెల 18 నుంచి ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం నోటిఫికేషన్ వస్తుందా.. లేదా అనే సందిగ్ధంలో విద్యార్థులున్నారు. ఇప్పటికే అకడమిక్ క్యాలెండర్ దెబ్బతిందని భవిష్యత్తులో ఉద్యోగాల నియామక నోటిఫికేషన్లు, పీజీ ప్రవేశాలకు అర్హత కోల్పోతామని పలువురు ఆవేదన చెందుతున్నారు.

ఆర్‌యూ పరిధిలో డిగ్రీ కళాశాలల వివరాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	14
ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు	68
మొత్తం కళాశాలల సంఖ్య	82
గత ఏడాది ప్రవేశాలు పొందిన విద్యార్థులు సంఖ్య	9,204
అబ్బాయిల సంఖ్య	4,714,
అమ్మాయిల సంఖ్య	4,490
బీఏ	1,469
బీకాం	3,291,
బీఎస్సీ	3,367,
బీబీఏ	380
బీసీఏ	697 మంది

సమన్వయ లోపంతోనే ఇలాంటి పరిస్థితి



ఉన్నత విద్యా శాఖ, ఉన్నత విద్యా మండలి మధ్య సమన్వయ లోపంతోనే డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్ ఆలస్యమవుతోంది. సింగిల్ లేదా డ్యూయల్ మేజర్ సబ్జెక్టులపై స్పష్టత ఇవ్వడంలో, అవగాహన కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. దీంతో మెరిట్ విద్యార్థులు ఇతర రాష్ట్రలకు వెళుతున్నారు. డిగ్రీ వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దాలి. లేని పక్షంలో ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులను ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమాలు చేయాల్సి వస్తుంది.

– స్వామి, ఏబీవీపీ కర్నూలు విభాగ్ కన్వీనర్

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే పలు అసంబద్ధ నిర్ణయాలు అమలు చేయడంతో విద్యా రంగం గాడితప్పింది. ఇంటర్ ఫలితాలు విడుదలై నెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం ప్రభుత్వానికి విద్యా వ్యవస్థపై ఏమాత్రం ప్రేమ ఉందో అర్థమవుతోంది. విద్యార్థుల జీవితాలతో ఆటలాడటం మాని అకడమిక్ క్యాలెండర్ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్, రాష్ట్ర అధ్యక్షులు, పీడీఎస్‌యూ



కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,000	7,169
పొద్దుతిరుగుడు	5,239	5,250
ఆముదం	5,090	5,090
వాము	2,011	13,060
ఉల్లి	1,069	1,389
ఎండుమిర్చి	4,860	6,195
శనగలు	6,511	6,511
కందులు	5,397	6,397
మొక్కజొన్న	2,401	2,401
మినుములు	5,059	7,030
కొర్రలు	2,637	3,127
సోయాబిక్కుడు	1,200	1,200
సజ్జలు	2,339	2,339

ఫోన్ నం : 08518–257204, 257661